ప్రశ్నించడం కోసం...?

RNI NO. TELTEL/2023/90455

# మన ప్రజాప్రతినిధి

ప్రజా ప్రతినిధి NEWS టీ.వి

తెలుగు దినపత్రిక

| సంపటి : 3 | సంచిక :341 | హైదరాబాద్ | ఆదివారం | అక్టోబర్ 4 2026 | పేజీలు : 4 వేల : 2/ |
|---|---|---|---|---|---|

Published From:Telangana & Andrapradesh,Hyderabad & Vijayawada.Editar:G.Srinivas,epaper.manaprajaprathinidhi,com.

## హోటళ్లలో వరుస మరణాల కలకలం

- షారోన్ నిఖిత కేసులో హత్య ఆరోపణలు
- శిరీష మృతి కేసులో దర్యాప్తు ముమ్మరం
- సృజన కేసుతో భద్రతపై ప్రశ్నలు



అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగరంలోని వివిధ హోటళ్లలో యువతులు అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందిన ఘటనలు వరుసగా వెలుగుచూడడం తీవ్ర కలకలం రేపుతోంది. సెప్టెంబర్ 21న మాదాపూర్‌లోని ఒక హోటల్‌లో షారోన్ నిఖిత టోప్నో మృతి చెందగా, సెప్టెంబర్ 29న ఎస్ఆర్ నగర్‌లో బి. శిరీష మృతదేహం లభించింది. అక్టోబర్ 2న మియాపూర్‌లో వైద్య విద్యార్థిని కోమటి సృజన మృతి చెందిన ఘటన వెలుగులోకి రావడంతో నగరంలో హోటళ్ల భద్రత, అతిథుల నమోదు

2

## ఓటర్ల జాబితా సవరణపై విమర్శలు

- ఓట్ల తొలగింపుపై బీజేపీపై ఆరోపణలు
- ఓబీసీ గణన కోసం ఉద్యమం
- ఢిల్లీ వరకు పోరాటం తీసుకెళ్తామన్న వీహెచ్



2

## పాలేరు వాగుపై చెక్‌డ్యామ్ ప్రారంభం

- పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరణ
- దివాకర్‌తో కలిసి అభివృద్ధి పనుల ప్రారంభం
- రైతులకు సాగునీటి భరోసా కల్పించే నిర్మాణం



2

## పిల్లల డిజిటల్ భద్రతకు సమష్టి కృషి




- న్యాయ సేవల కార్యక్రమాలకు పూర్తి మద్దతు
- విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలో దక్షిణాది ప్రాంతీయ సదస్సు
- అర్జున్‌రామ్ మెఘ్వాల్ సమక్షంలో కార్యక్రమ ప్రారంభం
- పిల్లల రక్షణలో తల్లిదండ్రుల పాత్ర కీలకం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

## నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సదుపాయం

- పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక అవకాశం
- ప్రతిభకు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకాకూడదు
- పొంగులేటి ప్రకటనతో యువతలో ఆనందం



3

## ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన



- అక్టోబర్ 6న జిల్లా కేంద్రాల్లో నిరసనలు
- నవంబర్ 1న ఢిల్లీ ముట్టడికి పిలుపు
- ఎన్నికల సంఘం తీరుపై మహేష్ గౌడ్ విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అర్హత కలిగిన లక్షలాది మంది పౌరుల ఓట్లు తొలగిస్తున్నారంటూ ఆరోపించారు. ఈ అంశంపై ఇండియా కూటమికి చెందిన అన్ని రాజకీయ పార్టీలు కలిసి దేశవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 6న జిల్లా ప్రధాన కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని మహేష్ కుమార్ గౌడ్ వెల్లడించారు. అనంతరం అక్టోబర్ 8న ఇండియా కూటమి పక్షాలన్నీ కలిసి లోక్ భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం ఈ పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని పేర్కొన్నారు. నవంబర్ 1న "ఛలో ఢిల్లీ" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. దేశవ్యాప్తంగా

3

## శ్రీసిటీలో బాయిలర్ పేలుడు విషాదం

- నలుగురు కార్మికుల మృతితో తీవ్ర విషాదం
- చంద్రబాబు ఆదేశాలతో సహాయక చర్యలు
- లోకేశ్, అనిత సంతాపం వ్యక్తం



తిరుపతి, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో శనివారం జరిగిన బాయిలర్ పేలుడు ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఫ్యాక్టరీలో ఉన్న వాటర్ బాయిలర్ ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోవడంతో నలుగురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు.

2

## మహిళా అభ్యర్థిపై వ్యాఖ్యలు కలకలం



- ప్రచారంలో వ్యక్తిగత విమర్శలపై దుమారం
- సత్యభామకు అండగా నిలిచిన విజయ్
- ఎన్నికల వేళ తమిళ రాజకీయాల్లో ఉద్రిక్తత

ధరాపురం, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): తమిళనాడులో ధరాపురం ఉపఎన్నిక ప్రచారం సందర్భంగా టీవీకే అభ్యర్థి పి. సత్యభామపై డీఎంకే అధ్యక్షుడు ఎం.కె. స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర రాజకీయ దుమారానికి దారితీశాయి. సత్యభామను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల్లో ఆమె శరీరాకృతిని ప్రస్తావించినట్లు ఆరోపణలు రావడంతో టీవీకే నాయకులు, పలువురు నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం ఎన్నికల

2

మన ప్రజాప్రతినిధి

ఆదివారం 4 అక్టోబర్ 2026

# హోటళ్లలో వరుస మరణాల కలకలం




విధానాలపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మాదాపూర్ ఘటనలో విశాఖపట్నానికి చెందిన షారోన్ నిఖిత తన స్నేహితుడు శ్రీనివాస రవితేజతో కలిసి హోటల్‌లో బస చేసినట్లు పోలీసులు గుర్తించారు. మరుసటి రోజు ఆమె అపస్మారక స్థితిలో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శరీరంపై గాయాల ఆనవాళ్లు కనిపించడంతో పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, వాగ్వాదం సమయంలో దాడి చేసినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఎస్ఆర్ నగర్ ఘటనలో బ్యాంకు ఉద్యోగిని బి. శిరీష హోటల్ గదిలో మృతిగా కనిపించింది. ఆమెతో కలిసి ఉన్న వ్యక్తి తెల్లవారుజామున హోటల్ నుంచి వెళ్లిపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. గదిలోకి వెళ్లిన హోటల్ సిబ్బంది మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వాగ్వాదం తర్వాత దాడి జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తూ హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తాజాగా మియాపూర్‌లో వైద్య విద్యార్థిని కోమటి సృజన మృతి చెందడం మరోసారి ఆందోళనకు దారితీసింది. ఆమె తన స్నేహితుడితో కలిసి హోటల్‌లో బస చేసినట్లు దర్యాప్తులో తేలింది. అనంతరం ఆమె మృతదేహం గదిలో లభించగా, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. మృతికి గల ఖచ్చితమైన కారణాలు పోస్టుమార్టం నివేదిక అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మూడు ఘటనల నేపథ్యంలో హోటళ్లలో అతిథుల వివరాల ధ్రువీకరణ, గుర్తింపు పత్రాల పరిశీలన, నిఘా వ్యవస్థల పనితీరు, సీసీ దృశ్యాల పర్యవేక్షణ వంటి అంశాలపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అనుమానాస్పద కదలికలు గుర్తించినప్పుడు హోటల్ యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తున్నాయా అనే అంశంపై కూడా చర్చ సాగుతోంది. వరుస ఘటనల దృష్ట్యా నగరంలోని హోటళ్లలో భద్రతా ప్రమాణాలు, నిబంధనల అమలుపై ప్రత్యేక తనిఖీలు అవసరమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పోలీసులు మాత్రం ప్రతి ఘటనను విడివిడిగా దర్యాప్తు చేస్తున్నామని, అన్ని కోణాల్లో ఆధారాలు సేకరిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు. హోటళ్లలో జరిగిన ఈ వరుస మరణాల వెనుక పరిస్థితులు ఏమిటన్న దానిపై దర్యాప్తు నివేదికలు వెలువడిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# ఓటర్ల జాబితా సవరణపై విమర్శలు




హైదరాబాద్, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపు జరుగుతోందని కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆరోపించారు. నాలుగోసారి అధికారంలోకి రావాలనే లక్ష్యంతో భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్ కలిసి ఈ ప్రక్రియను అమలు చేస్తున్నాయని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, ఓటర్ల జాబితాలో భారీ స్థాయిలో మార్పులు జరుగుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల సంఘంపై ప్రభావం చూపుతోందని వి. హనుమంతరావు ఆరోపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఓట్ల తొలగింపు జరుగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల ప్రక్రియ ఎంతో కీలకమని, ఓటర్ల హక్కులను పరిరక్షించడం ఎన్నికల సంఘం బాధ్యత అని పేర్కొన్నారు.రాజ్యాంగ పరిరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కొన్ని చర్యలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జనాభా గణన కొనసాగుతున్నప్పటికీ అందులో ఇతర వెనుకబడిన వర్గాల ప్రత్యేక గణన అంశం లేకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం కోసం ఓబీసీ గణన అవసరమని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాలకు సరైన ప్రాతినిధ్యం, సంక్షేమ పథకాల రూపకల్పన కోసం ఈ గణన కీలకమని అభిప్రాయపడ్డారు.ఈ అంశంపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వి. హనుమంతరావు ప్రకటించారు. శంషాబాద్‌లో ఓబీసీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించి రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి రూపకల్పన చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టి 'ఓబీసీ గర్జన'ను ఢిల్లీ వరకు తీసుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఓబీసీ గణన చేపట్టే వరకు ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు. న్యాయం కోసం జరుగుతున్న ఈ పోరాటంలో అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని, పార్టీ శ్రేణులు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# పాలేరు వాగుపై చెక్‌డ్యామ్ ప్రారంభం




ఖమ్మం, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులకు నీటి కొరత సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా పాలేరు నియోజకవర్గంలోని కట్టుకాచారం గ్రామం వద్ద పాలేరు వాగుపై రూ. 6.65 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్.తో కలిసి చెక్‌డ్యామ్‌ను పరిశీలించిన మంత్రి, ఈ నిర్మాణం ప్రాంతీయ రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా మారుతుందని పేర్కొన్నారు. కట్టుకాచారం, కొత్తగూడెం సహా పరిసర గ్రామాల రైతులకు ఈ చెక్‌డ్యామ్ ద్వారా ప్రత్యక్ష ప్రయోజనం చేకూరనున్నదని మంత్రి తెలిపారు. భూగర్భ జలమట్టాలు పెరగడంతో పాటు బోర్లు, బావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని చెప్పారు. వ్యవసాయ అవసరాలకు నిరంతర నీటి వనరులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు.దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో నీటి లభ్యతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న సమయంలో ఈ చెక్‌డ్యామ్ పూర్తికావడం రైతులకు ఊరటనిచ్చే అంశమని మంత్రి అభిప్రాయపడ్డారు. వర్షపాతం తగ్గిన సందర్భాల్లో కూడా నీటి నిల్వలను పెంచేందుకు ఇలాంటి నిర్మాణాలు కీలకంగా మారుతాయని వివరించారు. నీటి వనరుల సంరక్షణతో పాటు వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. చెక్‌డ్యామ్ నిర్మాణంతో పాలేరు వాగులో నీరు నిల్వ ఉండటం వల్ల సమీప గ్రామాల్లో భూగర్భ జలాలు పునరుద్ధరించబడతాయని అధికారులు వివరించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేపట్టిన ఈ పని ద్వారా పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందని వెల్లడించారు.పాలేరు వాగులో నీరు నిండుకుండలా నిల్వ ఉండడాన్ని చూసి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. చెక్‌డ్యామ్ నిర్మాణం వల్ల తమ వ్యవసాయ భూములకు నీటి లభ్యత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతుల సంతోషమే ప్రభుత్వానికి నిజమైన సంతృప్తిని ఇస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి సదుపాయాల విస్తరణ, భూగర్భ జలాల పరిరక్షణ, రైతుల సంక్షేమం లక్ష్యంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

# పిల్లల డిజిటల్ భద్రతకు సమష్టి కృషి






హైదరాబాద్, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాల నుంచి పిల్లలను రక్షించేందుకు న్యాయ సేవల ప్రాధికార సంస్థలు చేపడుతున్న కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. డిజిటల్ వేదికలపై పిల్లల భద్రతను బలోపేతం చేయడానికి రూపొందిస్తున్న అవగాహన కార్యక్రమాలు ప్రతి గ్రామానికి చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పిల్లల రక్షణ, సంక్షేమం విషయంలో ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతతో పనిచేస్తోందని పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో "డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూల న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం" అనే అంశంపై హైదరాబాద్‌లో దక్షిణాది ప్రాంతీయ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్‌రామ్ మెఘ్వాల్, సుప్రీంకోర్టు న్యాయమూర్తి, జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యనిర్వాహక అధ్యక్షుడు జస్టిస్ విక్రమ్ నాథ్, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్ మహదేవన్, జస్టిస్ అలోక్ అరాధే, తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.సదస్సులో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలు, పిల్లల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం పలు ప్రత్యేక చర్యలు చేపట్టిందని తెలిపారు. భరోసా కేంద్రాలు, బాలల సంరక్షణ విభాగాలు, సంక్షేమ కమిటీలు, ప్రత్యేక న్యాయస్థానాలు, న్యాయ సేవా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు, వైద్య, న్యాయ, మానసిక సలహా సేవలు అందించే భరోసా కేంద్రాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. దేశంలోనే తొలి బాలల అనుకూల న్యాయస్థానాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. పిల్లల రక్షణ కోసం మహిళల భద్రత విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సైబర్ ప్రయోగశాలలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పించే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థులనే సైబర్ అవగాహన దూతలుగా తీర్చిదిద్దుతూ తోటి విద్యార్థులకు భద్రతా సూచనలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.పిల్లల హక్కుల పరిరక్షణలో విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. పాఠశాల విద్యాశాఖతో న్యాయ సేవల సంస్థలు కలిసి పనిచేస్తున్నాయని, ఉపాధ్యాయుల ద్వారా పిల్లలకు చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు వేలాది మంది బాలల సంరక్షణ అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించామని వెల్లడించారు. పిల్లలు సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులు కూడా అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రతి కుటుంబం అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అత్యవసర సైబర్ ఫిర్యాదుల కోసం 1930, బాలల సహాయ వాణి కోసం 1098 సంఖ్యలను ప్రతి తల్లిదండ్రి, ప్రతి విద్యార్థి గుర్తుంచుకోవాలని సూచించారు. న్యాయం అంటే కేవలం నేరస్తుడికి శిక్ష విధించడం మాత్రమే కాదని, బాధితుడి జీవితాన్ని తిరిగి గాడిలో పెట్టడం, గౌరవాన్ని పునరుద్ధరించడం, ముఖ్యంగా పిల్లల కోల్పోయిన బాల్యాన్ని తిరిగి అందించడమే నిజమైన న్యాయమని పేర్కొన్నారు. న్యాయ సేవల ప్రాధికార సంస్థల కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతుతో నిలుస్తుందని స్పష్టం చేస్తూ, ఉచిత న్యాయ సేవల కోసం సిద్ధం చేసిన సంచార లోక్ అదాలత్ వాహనాలను ఈ సందర్భంగా ప్రారంభించారు.

# శ్రీసిటీలో బాయిలర్ పేలుడు విషాదం




ప్రమాదంలో మరో వ్యక్తి తీవ్రంగా గాయపడగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో పరిశ్రమ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ప్రమాదం జరిగిన సమయంలో కార్మికులు తమ విధుల్లో నిమగ్నమై ఉన్నట్లు సమాచారం. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో మరో ఇద్దరిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ వారు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. – మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన చంద్రబాబుద– గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలురాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కూడా ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది అత్యంత బాధాకరమైన సంఘటన అని పేర్కొంటూ మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన, గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు.– అనిత ఆరా.. అధికారులకు కీలక ఆదేశాలు – ప్రమాద కారణాలపై విచారణ ప్రారంభంరాష్ట్ర హోంమంత్రి అనిత కూడా ఘటనపై స్పందించి తిరుపతి జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించడంతో పాటు మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు అధికారులు విచారణ చేపట్టగా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మహిళా అభ్యర్థిపై వ్యాఖ్యలు కలకలం




ప్రచారంలో వ్యక్తిగత విమర్శలు, మహిళల గౌరవం వంటి అంశాలపై పెద్ద చర్చకు కారణమైంది. ఈ వివాదంపై తమిళనాడు ముఖ్యమంత్రి, టీవీకే వ్యవస్థాపకుడు విజయ్ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల ప్రచారంలో ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలు చర్చించాల్సిన సమయంలో మహిళా అభ్యర్థిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం తగదని ఆయన పేర్కొన్నారు. రాజకీయ భేదాభిప్రాయాలు ఉండొచ్చుని, కానీ మహిళల గౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదని స్పష్టం చేశారు. మహిళలపై అవమానకరమైన వ్యాఖ్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని విజయ్ తెలిపారు. సత్యభామకు తాను సంపూర్ణ మద్దతుగా నిలుస్తానని పేర్కొంటూ, రాజకీయ నాయకుడిగానే కాకుండా మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ తరహా వ్యాఖ్యలు రాజకీయ సంస్కృతికి హానికరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా, స్టాలిన్ వ్యాఖ్యలను టీవీకే మహిళా గౌరవాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. మహిళలను అవమానించే వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని టీవీకే డిమాండ్ చేసింది. ఈ ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ చర్చ కొనసాగుతోంది. అక్టోబర్ 6న జరగనున్న ధరాపురం ఉపఎన్నికకు ముందు టీవీకే, డీఎంకే మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది. ఒకవైపు పాలన, ప్రజా సమస్యలపై విమర్శలు కొనసాగుతుండగా, మరోవైపు వ్యక్తిగత వ్యాఖ్యల వివాదం ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉత్కంఠభరితంగా మార్చింది. ఉపఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో కీలక ప్రభావం చూపే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ సదుపాయం




ఖమ్మం, అక్టోబర్ 3 (మనప్రజాప్రతినిధి): నిరుద్యోగ యువత కలలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా నాణ్యమైన శిక్షణకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్లు ప్రకటించారు. ఒక్కో అభ్యర్థికి సుమారు రూ.40 వేల విలువైన శిక్షణను ఉచితంగా అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల సాధన కోసం కోచింగ్, వసతి ఖర్చులు భరించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ యువత ప్రతినిధులు శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. గ్రామాలు, పట్టణాల్లోనే ఉంటూ నాణ్యమైన శిక్షణ పొందే అవకాశం కల్పించాలని కోరారు. వారి విజ్ఞప్తిపై వెంటనే స్పందించిన మంత్రి, ప్రతిభ ఉన్న యువత ఆర్థిక పరిస్థితుల వల్ల వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ప్రముఖ శిక్షణ సంస్థకు చెందిన ఆన్‌లైన్ తరగతులు, నమూనా పరీక్షల సదుపాయాలను పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 28వ తేదీ నుంచి ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వేలాది మంది నిరుద్యోగులకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ఆన్‌లైన్ శిక్షణలో ఉపనిరీక్షకుడు, కానిస్టేబుల్, గ్రూప్–1 ప్రాథమిక పరీక్ష, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, పంచాయతీ కార్యదర్శి, అటవీ బీట్ అధికారి, రైల్వే తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన సాధారణ అధ్యయన అంశాలు, సాధన పరీక్షలు అందుబాటులో ఉండనున్నాయి. ఒకసారి నమోదు చేసుకున్న అభ్యర్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఐదు వేలకుపైగా దృశ్య పాఠాలు ఏడాది పాటు అందుబాటులో ఉండేలా డిజిటల్ వేదికను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉపనిరీక్షకుడు, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఖమ్మంలో అమలవుతున్న ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని నిరుద్యోగ యువత కోరడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసే అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి అవసరమైన కార్యాచరణ రూపొందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. తమ విజ్ఞప్తిపై వెంటనే స్పందించి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించేందుకు ముందుకొచ్చినందుకు నిరుద్యోగ జేఏసీ నాయకులు వంశీ, చెర్రీ ప్రవీణ్, తేజావత్ ప్రవీణ్, శిరీష మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన




ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని ప్రతిపక్ష పార్టీలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభమని, దాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం వ్యవహార తీరుపై కూడా మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో నిజమైన ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని కోరుతూ ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారంటూ విమర్శించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను స్వతంత్రంగా పనిచేయనివ్వాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో నమ్మకం దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై ఇండియా కూటమి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు.

# రాష్ట్రస్తాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, చేర్యాల, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. చేర్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి టీ. కృష్ణ రాష్ట్రాస్తాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పోలోజు నరసింహ చారి శనివారం తెలిపారు.స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్ 19 పోటీలలో భాగంగా శుక్రవారం సంగారెడ్డి జిల్లా అత్నూర కాలేజీలో జరిగిన ఉమ్మడిజిల్లా పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచి నార్సింగ్ లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల లలో ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యము వహిస్తాడనితెలిపారు.కృష్ణనుపాఠశాలప్రిన్సిపాల్ పోలోజు నరసింహచారి,పి.ఈ.టి.రేణుక,పి.డి.సురేష్ లను ఇతర అధ్యాపకులు అభినందించారు.

# సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సు



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ,జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం.సోలార్ విద్యుత్ ఉత్పత్తి,వినియోగం మరియు దాని ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జనగామ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.జనగామ డివిజనల్ ఇంజనీర్ శ్రీ లక్ష్మీ నారాయణ రెడ్డి,అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి కడకంచి బాలమణి,వైస్ చైర్‌పర్సన్. పర్వతాలు భూష,మూడవ వార్డు కౌన్సిలర్ శ్రీమతి బూడిద జ్యోతి,నాలుగవ వార్డు కౌన్సిలర్ శ్రీమతి మంత్రి సుమలత,ఐదవ వార్డు కౌన్సిలర్ శ్రీ మిడపాక భాస్కర్, ఆరవ వార్డు కౌన్సిలర్ బాల భరద్వాజ్ బొక్క, పదవ వార్డు కౌన్సిలర్ శ్రీమతి రజిని నీరటి,ఇరవై ఐదవ వార్డు కౌన్సిలర్.పాముకుంట్ల ప్రసాద్ గౌడ్,పాల్గొన్నారు.ఈ సందర్భంగా సోలార్ విద్యుత్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను అధికారులు వివరించారు.సౌర విద్యుత్‌ను ప్రోత్సహించడం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చని తెలిపారు.అలాగే సోలార్ విద్యుత్ ఉత్పత్తి విధానం,ప్రభుత్వ ప్రోత్సాహకాలు,సబ్సిడీలు,బ్యాంకు రుణ సదుపాయాలు,నెట్ మీటరింగ్ విధానం,సౌర విద్యుత్ వినియోగం ద్వారా కలిగే ఆర్థిక మరియు పర్యావరణ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అధికారులు,ప్రజాప్రతినిధులు,విద్యుత్ శాఖ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# జనగామ మున్సిపల్ కార్యాలయంలో...
## పీఎం సూర్య ఘర్.ముఫ్త్ బిజిలి యోజన కార్యక్రమం




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, జనగామ నియోజకవర్గం :జనగామ నియోజకవర్గం. జనగామ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పీఎం సూర్య ఘర్‌ముఫ్త్ బిజిలి యోజనలో భాగంగా సేవా సేతు అభియాన్ అవగాహన సదస్సు సూపరింటెండింగ్ ఇంజినీర్ సంపత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్,హాజరయ్యారు.రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు,ప్రభుత్వ సబ్సిడీ,దరఖాస్తు విధానం,బ్యాంకు రుణాలు,నెట్ మీటరింగ్ తదితర అంశాలపై బ్యాంకు, సోలార్ ప్రతినిధులు అవగాహన కల్పించారు.రూఫ్‌టాప్ సోలార్ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు,విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఉత్సవం
## తల్లి, బిడ్డల ఆరోగ్యంపై అవగాహన



రావులపాలెం, మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక, అక్టోబర్ 3:తల్లులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో కీలకమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కే. నాగమణి అన్నారు. సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజాసేవను పురస్కరించుకుని శనివారం వేదిరేశ్వరం గ్రామంలో అంగన్‌వాడీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామపంచాయతీ పరిధిలోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం57 వద్ద ఈ కార్యక్రమం జరిగింది. కొత్తపేట ఐసీడీఎస్ సీడీపీఓ గజలక్ష్మి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ కే. నాగమణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, రాగిజావ వంటి పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఎదుగుదలకు, ఎముకల బలోపేతానికి దోహదపడుతుందని తెలిపారు.కార్యక్రమంలో బీజేపీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాలూరి సత్యానందం మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ల్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ బడుగుసుబ్బాయమ్మ మాట్లాడుతూ భావితరం బలంగా ఎదగాలంటే ఆరోగ్యవంతమైన యువత అవసరమని, చిన్ననాటి నుంచే పోషకాహారంపై శ్రద్ధ పెట్టడం ద్వారా ఇది సాధ్యమవుతుందని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సేవలను గుర్తించి సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు.అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఆత్మ కమిటీ డైరెక్టర్ మద్దంశెట్టి శ్రీనివాసరావు వారిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి సబిత, టీడీపీ నాయకుడు రామకృష్ణంరాజు, రాష్ట్ర యువమోర్చా నాయకుడు పాలూరి జయప్రకాష్ నారాయణ, జిల్లా సంచార జాతుల కన్వీనర్ వీర్నాల రమణ, లక్ష్మీనారాయణ, ఉమెన్ పోలీస్ ఎన్. నాగరత్నం, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి




సూర్యాపేట (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక)యుద్ధం వలన మానవాళికి అంతులేని నష్టం జరుగుతుందని యుద్ధం వలన ప్రాణహానితోపాటు భవిష్యత్ తరాలు తీవ్రంగా దెబ్బతింటాయని అఖిలభారత సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి ప్రముఖ న్యాయవాది కె.వి.ఎల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మాండపల్లి ప్రభాకర్ ఫంక్షన్ హాల్ లో జిల్లా నాలుగో మహాసభలో పాల్గొని మాట్లాడుతూ వ్యక్తి ఆలోచన మూలంగానే శాంతి గాని యుద్ధం గాని వస్తాయని, చెడు ఆలోచన అనేది ప్రపంచాన్ని వేరు చేస్తుందని ఆయన అన్నారు. సామ్రాజ్యవాదం కాంక్షతో అమెరికా వంటి దేశాలు ప్రపంచంలోని చిన్నచిన్న దేశాలను ఆక్రమించాలని చూస్తున్నాయని, తమ వ్యాపార విస్తరణ కోసం యూరప్ దేశాలు కూడా అమెరికాకు వంత పాడుతున్నాయని ఆయన అన్నారు. ఇరాన్ పై యుద్ధం వలన ఇరాన్ లో వేలాది మంది క్షతగాత్రులవడం, చిన్నారులు చనిపోవడం, అంగ వికలాంగులు కావటం జరిగిందని అన్నారు ఆహార పదార్థాల కొరత అవసరమైన నిత్యవసర మందులు లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, యుద్ధం మానవాళికి మంచిది కాదని ఆయన అన్నారు. సామ్రాజ్యవాదం నశించాలని, సామ్యవాదం వర్ధిల్లాలని, యుద్ధం వద్దు శాంతి ముద్దు, ఉగ్రవాదం మతోన్మాదం వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. మౌనంగా వుండే వారి వల్ల దేశానికి ఎటువంటి ప్రయోజనం లేదని మౌనంగా ఉండటం వల్ల అభివృద్ధి ఆగిపోతుందని, ఆలోచన లేని వ్యక్తులతో సమాజం బాగుపడదని అన్నారు. శాంతియుతంగా జీవిద్దాం ప్రగతివైపు పయనిద్దామని వారు అన్నారు . ప్రతి ఒక్కరు కూడా అమెరిక యొక్క యుద్ధకాంక్షకు వ్యతిరేకంగా గొంతు విప్పాలని, నిరుద్యోగం, నిరక్షరాస్యత, దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన అన్నారు. మహాసభకు ముందు జిల్లా గౌరవ అధ్యక్షులు బొమ్మగాని శ్రీనివాస్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం మహాసభ అధ్యక్షులు తోగిటి మురళి, బొమ్మగాని శ్రీనివాస్, చామల అశోక్ కుమార్, పుట్టపాక అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ మహాసభలో డాక్టర్ సమత వై వెంకటేశ్వర్లు, మందారి డేవిడ్ కుమార్, గుడిపూడి వెంకటేశ్వరరావు, తలమల్ల హస్సేన్, నాతి సవేంద్ర కుమార్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, అనంతుల మల్లేశ్వరి, బూర వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం, ఖమ్మంపాటి రాము, దంతాల రాంబాబు, ఎడెల్లి శ్రీకాంత్, గొడ్డలి నరసయ్య, తాళ్లపల్లి సత్యనారాయణ, దూలం నగేష్, దికొండ శ్రీనివాస్, పొన్నం రమేష్, గాలి రామకృష్ణ, నాతి లీలావతి, భూపాల్ ,బత్తుల నరసయ్య సారెడ్డి వెంకటరెడ్డి, చిలక రాజు శ్రీను, దాయం ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన ప్రజాప్రతినిధి

ఆదివారం 4 అక్టోబర్ 2026

## తపస్ పల్లి గ్రామంలో ఘనంగా పోషణ మాసం వేడుకలు




మన ప్రజా ప్రతినిధి దినపత్రిక ,కొమురవెల్లి, జనగామ నియోజకవర్గం:జనగామ నియోజక వర్గం. జాతీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున చేర్యాల ప్రాజెక్టు పరిధిలోని కొమురవెల్లి మండల స్థాయి పోషణ మాసం వేడుకలు తపస్పల్లి గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సూపర్వైజర్ చంద్రకళ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సంపూర్ణమైన పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు అలవాటు చేసుకోవాలని గర్భిణీ బాలింతలు తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే సేవలను వినియోగించుకోవాలని కోరడం జరిగింది.కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గర్భిణీ బాలింతలు ఆరు సంవత్సరాల లోపు పిల్లలు తీసుకోవలసిన ఆహారం గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బ్లాక్ కోఆర్డినేటర్ కనకరాజు మాట్లాడుతూ తొమ్మిదవ జాతీయ పోషణ మాసం యొక్క ఉద్దేశాలను గ్రామస్తులకు అవగాహన కల్పించడం జరిగింది.ప్రతి ఒక్కరు నిత్యం తీసుకునే ఆహారంలో ఆహార వైవిధ్యతను పాటిస్తూ సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించడం జరిగింది.కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతాలు,పిల్లలకు అన్నప్రాసన,అక్షరాభ్యాసం,కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.

## డిజిటల్ లెర్నింగ్ పై అవగాహన కార్యక్రమం



'నేరేడుచర్ల (మన ప్రజా ప్రతినిధి దినపత్రిక)ట్యూటరిక్స్" డిజిటల్ లెర్నింగ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో పునీత్, పార్థున్ జై ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు మరియు పాఠశాల విద్యార్థులకు పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నేరేడుచర్ల నందు డిజిటల్ లెర్నింగ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు అనంతరం ఎంఈఓ ఎం బాలు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకొని ఉపాధ్యాయులు,విద్యార్థులు విద్యా ప్రమాణాలు,అభ్యసనా సామర్థ్యాలు సాధించే అవకాశాలున్నాయని, ఉన్నత ప్రమాణాలు సాధించే క్రమంలో సాంకేతికతను సద్వినియోగపరచుకోవాలని కోరారు ప్రధానోపాధ్యాయులు బి మధు,పి సత్యనారాయణ రెడ్డి, ఎల్ శ్రీనివాసరావు, వెంకట్ రెడ్డి, రవీందర్ రెడ్డి, పరశురాములు, లింగయ్య ఉపాధ్యాయులు ఎం సైదులు, జానకి రాములు, భానుమతి, బికోజి, వీరారెడ్డి,స్వప్న తదితరులు పాల్గొన్నారు

## బిజెపి మంత్రి మధుకర్ జీకి పారెల్లి మహేష్ ఘన స్వాగతం



కోదాడ ( మన ప్రజా ప్రతినిధి దినపత్రిక) తెలుగు రాష్ట్రాల బీజేపీ సంస్థాగత నిర్మాణంలో మునుపెన్నడూ లేనంత ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రెండు రాష్ట్రాల ఉమ్మడి బీజేపీ సంఘటన మంత్రిగా అత్యంత కీలకమైన బాధ్యతలు చేపట్టిన నూకల మధుకర్ జీ తొలిసారిగా విజయవాడ నుండి హైదరాబాద్‌కు రోడ్డు మార్గంలో వెళ్తుండగా ఉమ్మడి నల్గొండ జిల్లా సరిహద్దు పట్టణమైన కోదాడ వేదికగా ఒక ఆసక్తికర రాజకీయ ఘట్టం ఆవిష్కృతమైంది .హైవేపై వ్యూహాత్మక కలయిక.. కేడర్‌లో కొత్త జోష్ వచ్చిందని మధుకర్ కోదాడకు చేరుకోగానే బీజేపీ చిలుకూరు మండల పార్టీ అధ్యక్షులు పారెల్లి మహేష్ తన అనుచర శ్రేణులతో కలిసి జాతీయ రహదారిపైనే నూతన 'బాస్'కు శాలువాతో ఘన సత్కారం చేసి, తెలంగాణ స్వాగతం పలికారు. సుదీర్ఘ కాలం తర్వాత ఒక పక్కా తెలుగు నేతకు అత్యున్నత సంస్థాగత పగ్గాలు అప్పగించడంతో క్షేత్రస్థాయి లీడర్లలో ఉత్సాహం ఉరకలేస్తోంది.ఈ సంక్షిప్త భేటీలోనే చిలుకూరు మండలాధ్యక్షులు పారెల్లి మహేష్ కోదాడ నియోజకవర్గంలోని, ముఖ్యంగా చిలుకూరు మండల పరిధిలోని రాజకీయ పరిణామాలు మరియు పార్టీ కేడర్ పరిస్థితిని నూతన సంఘటన మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తెరవెనుక ఉండి వ్యూహాలు రచించడంలో దిట్ట అయిన మధుకర్ జీ కూడా స్థానిక లీడర్లకు రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన కీలక వ్యూహాలపై దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది. పారెల్లి మహేష్ ఆధ్వర్యంలో హైవేపై ఆయన్ని కలవడం పార్టీ శ్రేణులకు ఆనందం కలిగించింది అన్నారు.

## గ్రామ గ్రామాన బి ఆర్ ఎస్ వి గళం



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక అక్టోబర్ 3 చిన్నకోడూరు:మాజీ మంత్రి సిద్దిపేట ఏమ్మెల్యే హరీష్ రావు గారి ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు, ప్రస్తుతం అమలు చేస్తున్న విధానాలపై ప్రజలకు వాస్తవాలను వివరించేందుకు "గ్రామ గ్రామాన బి ఆర్ ఎస్ వి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బి ఆర్ ఎస్ వి నాయకులు తెలిపారు.ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, విద్యార్థులు, యువత, మహిళలు, తెలంగాణ ప్రజలకు చేస్తున్న మోసం గురుంచి, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను గ్రామస్థాయి నుంచి ప్రజల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.ప్రభుత్వం తన వాగ్దానాలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని బి ఆర్ ఎస్ వి ఆరోపించింది. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియాంబర్స్ మెంట్, కానీ , విద్య వ్యవస్థ ను కుని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఉద్యోగ నియామకాలు తదితర విద్యార్థుల సమస్య ను ప్రభుత్వనికి తెలిసే విదంగా టిఆర్ఎస్వి గ్రామ గ్రామ పోరాటం చేస్తాం అని అన్నారు.ఈ కార్యక్రమం లో గణగోని శ్రవణ్ గౌడ్, చెట్టుపల్లి భాను చందర్, గొల్లపల్లి రాజశేఖర్ రెడ్డి, మన్నె ఆనంద్,కొలను రఘు, నముండ్ల శ్రీకాంత్, ఎలుక అనిల్ ఉన్నారు

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బొంతు శ్రీదేవి యాదవ్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్: మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్ లోని ప్యాకెట్ డంపింగ్ యార్డ్ లో చెక్ వేసే జెసిబి మిషన్ ద్వారా కరెంట్ షాక్ కొట్టి శివ అనే వ్యక్తి మరణించిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.ఈ విషయం తెలుసుకున్న మాజీ కార్పొరేటర్ శ్రీమతి బొంతు శ్రీదేవి యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన న్యాయం చేస్తామని తెలియజేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

## ప్రతిభ కలిగిన విద్యార్థికి రూ 30 వేలు సహకారం




మన ప్రజాప్రతినిధి//భీమవరం అక్టోబర్03: ప్రతిభ కలిగిన విద్యార్థులకు వారి ఉన్నత వద్యకు దాతలందిస్తున్న సహకారం మరువలేనిదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శనివారం బిడిఎస్ విద్యార్థికి దాతల సహకారంతో రూ 30 వేలు ఆర్థిక సహాయాన్ని అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ప్రగతి కలిగిన పేదరికంతో ఉన్నత విద్యకు దూరంగా ఉన్న ప్రతిభావంతులకు సమాజం దాతలు ఆదుకోవాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భీమవరం విష్ణు కళాశాలలో బిడిఎస్ చదువుతున్న అబ్బరాజు పవన్ కళ్యాణ్ కు దాతలు ప్రముఖ బిల్డర్ కోటిపల్లి నాగరాజు రూ 20 వేలు, గన్నాబత్తుల సతీష్ రూ 10 వేలు అందించారని తెలిపారు

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మన ప్రజ ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట అక్టోబర్ 3 :చేగుంట మండలం చందాయిపేట గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు సమీర్ రోడ్డు ప్రమాదంలో అకాల మృతి చెందడం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నెలకొన్నాయి.యువకుడి మృతి పట్ల చేగుంట గ్రామ ఉప సర్పంచ్ రఫీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంటనే బాధిత కుటుంబాన్ని శివంపేట్ మండలం శభాష్ పల్లి గ్రామం మృతుడి అమ్మమ్మ నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి తన సొంత నిధుల నుండి రూ. 5,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. అంత్యక్రియలకు, కుటుంబ అవసరాలకు ఈ సాయం ఉపయోగపడుతుందని తెలిపారు.మృతుని కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రభుత్వం నుండి రావాల్సిన సహాయం అందేలా కృషి చేస్తామని ఉప సర్పంచ్ రఫీ హామీ ఇచ్చారు.

## శిక్షణ పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు సర్టిఫికెట్ల అందజేత




మన ప్రజా ప్రతినిధి కొండపాక :కుకునూరుపల్లి మండల పరిధిలో ఐదు రోజుల వార్డు సభ్యులకు నిర్వహించిన శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తి అయ్యాయని కుకునూరుపల్లి మండల ఎంపీడీఓ మహబూబ్ అలీ తెలిపారు. ఐదు రోజుల పాటు వార్డు సభ్యులకు గ్రామపంచాయతీ పాలన విధులు, బాధ్యతలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు పేర్కొన్నారు. శిక్షణలో వార్డు సభ్యులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలపై అవగాహన కల్పించినట్లు ఎంపీడీఓ తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యులు కీలక పాత్ర పోషించాలని ఎంపీడీఓ మహబూబ్ అలీ సూచించారు. శిక్షణ తరగతులను విజయవంతంగా పూర్తి చేసుకున్న వార్డు సభ్యులకు కార్యక్రమం ముగింపు సందర్భంగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణలో పాల్గొన్న వార్డు సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత





మన ప్రజా ప్రతినిధి దినపత్రిక: భీమవరం అక్టోబరు 4భీమవరం వీరవాసరం ;ఆంధ్రప్రదేశ్ లో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మౌలిక వసతులు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో పల్లె పండుగ కార్యక్రమం కీలకంగా ఉంటుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వీరవాసరం మండలంలోని పలు గ్రామంలో శనివారం పల్లె పండగ 3.0 లో భాగంగా ఎమ్మెల్యే అంజిబాబు పలు శంకుస్థాపనలు, పలు ప్రారంభోత్సవాలు చేశారు. పల్లె పండుగ 3.0లో భాగంగా నేలపోగుల గ్రామంలో జేఎస్ బి రోడ్డుకు శంకుస్థాపన, మడుగు పోలవరం గ్రామంలో సీసీ రోడ్డు, ఏపీఅర్ఆర్ ఎస్పీ గ్రాంట్ తో బీటీ రోడ్డుకు శంకుస్థాపన, కొణితివాడ గ్రామంలో సీసీ రోడ్లు శంకుస్థాపన, పల్లె పండుగ 2.0లో మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, జీఎస్ బి రోడ్డు ప్రారంభోత్సవం, ఉత్తర పాలెంలో సిసి రోడ్డుకు శంకుస్థాపన, పల్లె పండుగ 2.0లో మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవం, నౌదూరు గ్రామంలో పల్లె పండుగ 2.0 లో మంజూరైన నిధులతో నిర్మించిన జిఎస్ బి రోడ్డు ప్రారంభోత్సవం, అండలూరు గ్రామంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన, తోలేరు గ్రామంలో పల్లె పండుగ 2.0 లో మంజూరైన నిధులతో నిర్మించిన జిఎస్ బి రోడ్డును ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారుఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో పల్లె పండుగ 1.0, 2.0, 3.0 కార్యక్రమాలను చేపట్టడం జరుగుతున్నాయని, పల్లె పండుగ 1.0 ను 2024 అక్టోబర్ 14న రూ 4,500 కోట్లతో ప్రారంభించగా, పల్లె పండుగ 2.0ను 2025 నవంబర్ 26న రూ 6,787 కోట్లతో ప్రారంభించగా, ప్రస్తుతం పల్లె పండుగ 3.0 లో భాగంగా రూ 11,085 కోట్లతో గ్రామాల్లో వివిధ మౌలిక వసతుల అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైన్లు, బస్ షెల్టర్లు, గ్రామ పంచాయతీ భవనాలు తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే అంజిబాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

మన ప్రజాప్రతినిధి

ఆదివారం 4 అక్టోబర్ 2026

## బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి డిమాండ్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్: మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్ పరిధిలోని రామ్ కి సాజెట్ డంపింగ్ యార్డులో బిన్ బిన్ మెషిన్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై శివ మృతి చెందిన ఘటనపై ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనకు నిరసనగా డంపింగ్ యార్డు వద్ద ధర్నా నిర్వహించి, శివ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. డంపింగ్ యార్డులో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు తగిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ విషాద ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపిస్తూ, ఘటనకు దారితీసిన కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే కోరారు. శివ కుటుంబానికి రూ. 50 లక్షల నష్టపరిహారం అందించాలని, కుటుంబంలో ఒకరికి తగిన ఉపాధి లేదా జీవనోపాధికి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్, బిన్ బిన్ మెషిన్ నిర్వహణ సంస్థ ప్రతినిధులు, ఇతర బాధ్యుల పాత్రపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తప్పిదాలు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని బండారి లక్ష్మారెడ్డి కోరారు. అలాగే డంపింగ్ యార్డులోని అన్ని యంత్రాలు, విద్యుత్ వ్యవస్థలు, వైరింగ్, ఎర్తింగ్, భద్రతా ప్రమాణాలను తక్షణమే పరిశీలించి, లోపాలను వెంటనే సరిచేయాలని సూచించారు. కార్మికుల భద్రతకు అవసరమైన రక్షణ పరికరాలు, భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. శివ కుటుంబానికి న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. రూ. 50 లక్షల పరిహారం అందించడంతో పాటు కుటుంబానికి తగిన భరోసా కల్పించాలి. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో హెడ్ ఆఫీస్ వద్ద ధర్నా చేస్తాం అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హెచ్చరించారు. వారు చెత్త బంధు చేస్తామని చెప్పడం జరిగింది ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చెత్త బందు చేయొద్దని కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా డంపింగ్ యార్డులలో భద్రతా ప్రమాణాలను కఠినంగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వెల్జిపూర్ గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ కృషితో గ్రామానికి సబ్ స్టేషన్ మంజూరు



మన ప్రజాప్రతినిధి/ మనకొండూరు తేదీ 03 అక్టోబర్ :మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహకారంతో గత 20 సంవత్సరాలుగా లో-వోల్టేజ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వెల్జిపురం, ఓబులాపురం, చిక్కుడువానిపల్లె, రామోజీపేట గ్రామాల రైతులకు సబ్ స్టేషన్ మంజూరు చేశారు అని వెల్జిపురం గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ తెలిపారు. రూ. 3.76 కోట్ల అంచనా వ్యయంతో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు పత్రాన్ని గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ కు అందజేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక చొరవతో, ఎన్ పి డి సి ఎల్ సి ఎం డితో పాటు డి ఈ అంజయ్య, ఏ ఈ గుడెల్లి శ్రీనివాస్, ఏఈ నగేష్, లైన్ ఇన్స్పెక్టర్ వంగపల్లి రఘుపతి రెడ్డి, గ్రామ విద్యుత్ సిబ్బంది కనకయ్య, నరేష్ సహకారంతో సబ్‌స్టేషన్ మంజూరు ప్రక్రియ పూర్తయింది అన్నారు. గత రెండు దశాబ్దాలుగా రైతులు ఎదుర్కొంటున్న లో-వోల్టేజ్ సమస్యకు సబ్‌స్టేషన్ మంజూరుతో శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు ఎన్పీడీసీఎల్ అధికారులకు, సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ గుండా వెంకటేశం ఏఎంసి డైరెక్టర్ కంకణాల రాంప్రసాద్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించాలి

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల అక్టోబర్,03 :విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి, వారు ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే సూచించారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పద్మనాయక వేడుకల ప్రాంగణంలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థుల ప్రవర్తన, ఆలోచనా విధానంలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన తోడ్పాటు అందించాలన్నారు. పాఠశాలల్లో పిల్లలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో, సామాజిక మాధ్యమాల అధిక వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే ఆపద సమయాల్లో స్పందించే విధానం, సైబర్ రక్షణ, బాలల హక్కులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్, పోలీసు ఉన్నతాధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, వివిధ పాఠశాలల నిర్వాహకులు మరియు ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా వచ్చిన ఎక్సైజ్ ఎస్సై కి సన్మానం



మన ప్రజా ప్రతినిధి దినపత్రిక, చేర్యాల, జనగామ నియోజకవర్గం: జనగామ నియోజకవర్గం. చేర్యాల లోని గౌడ సంఘం ఆధ్వర్యంలో మన చేర్యాల కొత్తగా వచ్చిన ఎక్సైజ్. ఎస్ఐ బండి ఆదినారాయణ, ను శాలువాతో సత్కరించి సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు పచ్చిమడ్ల సిద్ధిరాములు గౌడ్, గుడాల ఐలయ్య, జిల్లా సెక్రెటరీ బండ కింది అరుణ్ గౌడ్, పచ్చిమడ్ల సత్యనారాయణ గౌడ్, గుడాల శ్రీనివాస్, పచ్చి మడ్ల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల అక్టోబర్,03 :మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే నష్టాలు మరియు సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సిరిసిల్ల రూరల్ సీఐ కదిరి నాగేశ్వరరావు, తంగళ్ళపల్లి ఎస్ఐ సిరిసిల్ల అశోక్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం కేసీఆర్ కాలనీ మండపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుతం పెరిగిపోతున్న సైబర్ నేరాల బారిన పడకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్ వివరాలు పంచుకోవద్దని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీఐ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు స్మశాన వాటిక కేటాయించండి




సదాసిపేట్ // (మన ప్రజాప్రతినిధి: సదాశివపేట పట్టణ పరిధిలోగల (7 వార్డు ) సిద్దాపూర్ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక లేదని శనివారం వాడు ప్రజలతో కలిసి డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సిద్ధాపూర్ స్మశాన వాటిక లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాళ్లు తమ కుటుంబీకులను వారికి సంబంధించిన పొలాలలో పెట్టుకోవడం ఇబ్బందికరంగా ఉందని, అలాగే సిద్దాపూర్ నుండి సదాశివపేట స్మశాన వాటికలో ఖననం చేయడానికి అభ్యంతరాలు ఇంతకు ముందు చాలాసార్లు చేసారని తెలియజేశారు. కాబట్టి సిద్దాపూర్ గ్రామ ప్రజలకు స్మశాన వాటిక కొరకు తగిన స్థలాన్ని కేటాయించమని గ్రామ పెద్దల సమక్షంలో అధికారులకు విన్న వించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గొల్ల కృష్ణయ్య, యం డి ఐ, రామ్ రెడ్డి, ఎం ఆంజనేయులు, బి శంకరయ్య, బి శ్రీనివాస్, అనంతరం గౌడ్, ఎం లక్ష్మయ్య, జై చంద్రశేఖర్, ఎస్ సుధాకర్, గూడెం మాధవరెడ్డి, అయుబ్ పాషా, ఖలీల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్పంచ్ షాబోద్దీన్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు



సదాశివపేట రిపోర్ట్ అక్టోబర్ 03( మన ప్రజా ప్రతినిధి):మెలిగిరి పెట్ సర్పంచ్ షాబోద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు ఉదయం 10:00 గం,,మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పంచాయతీ పాలక వర్గ సభ్యులు మరియు గ్రామా ప్రజలు పాల్గొని మహాత్మా గాంధీ జయంతి నిర్వహించడం జరిగింది తర్వాత ఎదీ+-=వాపీ-+ లో భాగంగా వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ (వీజీపీపీ)ఏర్పాటు చేస్తూ గ్రామా సభ ఏర్పాటు చేయడం జరిగిందిఈ



కార్యక్రమం లో గ్రామా సర్పంచ్ శ్రీ మెలిగిరి పెట్ షాబోద్దీన్ , ఉప-సర్పంచ్ శ్రీ పి . యాదయ్య ,గ్రామా కార్యదర్శి రాములు,వార్డు సభ్యులు పోలీస్ పద్మమ్మ,మల్లారెడ్డి,టేకురి జయమ్మ, సంగారెడ్డి, టేకురి రాములమ్మ, బండి సాబెరా, టేకురి శ్రీనివాస్ కో ఆప్షన్ మెంబర్ శ్రీనివాస్ రెడ్డి, అంగన్వాడీ టీచర్ మీన, ఇందిరా, ఫీల్డ్ మాన్ నాగేష్ మరియు గ్రామా పెద్దాలు సింగూర్ అంజిరెడ్డి, మైలారపు సంజీవ్ రెడ్డి, మహేందర్ ఎండి యదుల్ నాగరాజ్ మొహమ్మద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## భూముల రీ సర్వే కచ్చితత్వంతో చేయాలి

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




మనప్రజాప్రతినిధి/రాజన్న సిరిసిల్ల అక్టోబర్, 03:భూ భారతి కింద భూముల రీ సర్వే ప్రక్రియను పూర్తి కచ్చితత్వంతో, పకడ్బందీగా పూర్తి చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శనివారం భూ భారతి, భూముల రీ సర్వే మరియు ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై అదనపు కలెక్టర్ గడ్డం నగేష్‌తో కలసి జిల్లాలోని తహసీల్దార్లతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రీ సర్వేకు ముందుగా రైతులకు సమాచారం అందించాలని, జిల్లాలోని 18 రోవర్ యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించాలని సూచించారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూముల సర్వేను వేగవంతం చేయాలన్నారు. అలాగే, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిష్కరిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి మరియు సర్వే అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీకి సిరిసిల్ల ఇంగ్లీష్ యూనియన్ విద్యార్థిని ఎంపిక



మన(ప్రజా(ప్రతినిధి/రాజన్నసిరిసిల్ల ,అక్టోబర్, 03:రాజన్న సిరిసిల్ల జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ( ఎస్ జి ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల క్రికెట్ ఎంపికల్లో సిరిసిల్ల పట్టణ కేంద్రంలోని ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ కు చెందిన బి. సహస్ర (8వ తరగతి) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. 70వ ఎస్ జి ఎఫ్,క్రికెట్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు స్థానం సంపాదించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయ బృందం, వ్యాయామ ఉపాధ్యాయులు (పిడిఎస్) రాజశేఖర్, సాయి తేజలు విద్యార్థిని సహస్రను ప్రత్యేకంగా అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఎస్సి సెల్ అధ్యక్షుని సన్మానం చేసిన,మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట అక్టోబర్ 03:చేగుంట మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షులు గా నూతనంగా ఎన్నికైన మాసాయిపేట శ్రీనివాస్ నీ మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించిన చేగుంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వడ్ల నవీన్ కుమార్,ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోండి శ్రీనివాస్, ఎఎంసి డైరెక్టర్ మొజామిల్, దొంతి రెడ్డి బాల్ రెడ్డి, సినియర్ నాయకులు కాంగ్రెస్ పుర ఆగం,మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మోహన్ నాయక్,కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు సన్మానం..




మన ప్రజా ప్రతినిధి కొండపాక: కుకునూరుపల్లి మండల కేంద్రంలో వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర వాణిజ్య విభాగ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అన్నారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి, సమస్యల పరిష్కారంలో పాత్రికేయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ కపుల్స్ కుకునూరుపల్లి అధ్యక్షులు పాండురంగం, కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య మహాసభ కుకునూరుపల్లి అధ్యక్షులు గంగిశెట్టి పాండురంగం, నంగునూరు నాగరాజు, గంగిశెట్టి బాలయ్య, శ్రీనివాస్, నాగమల్లి సత్యం, గంగిశెట్టి రాజ్ కుమార్, కుడితల సంతోష్, కొడతాల చంద్రశేఖర్, కొమురవెల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలి
## కలెక్టర్ గరిమ అగ్రవాల్...



మన(ప్రజా(ప్రతినిధి/రాజన్న సిరిసిల్ల ,అక్టోబర్ 03:విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. శనివారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద గల మహాత్మా జ్యోతిబా పూలే విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూమ్‌లోని బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి నాణ్యతను తనిఖీ చేసిన కలెక్టర్, మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. ఆర్.ఓ ప్లాంట్‌ను, పాఠశాల ఆవరణను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... రెసిడెన్షియల్ విద్యాలయాల్లో లభించిన అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు బాగా చదవాలని, చదువుతో పాటు ఆటలు, సంగీతం, డాన్స్‌లలోనూ రాణించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా మండల స్థాయి అధికారులతో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పరిశుభ్రత పాటిస్తూ సమయాన్ని వృథా చేయకుండా ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.

## వరంగల్ జిల్లా మమునూరు ఎయిర్ పోర్టు కు దొడ్డి కొమురయ్య కురుమ పేరు పెట్టాలి?
## బండారి పాండు కురుమ....



మునిపల్లి రిపోర్ట్ అక్టోబర్ 03( మన ప్రజాప్రతినిధి):సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం సీనియర్ నాయకులు వరంగల్ జిల్లా మమునూరు ఏ ఇయర్ పోర్ట్ కు తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమరయ్య కురుమ పేరు పెట్టాలి భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం,తొలి అమరుడైన దొడ్డి కొమరయ్య కురుమ నిజాం నిరంకుశ పాలనలో దగాపడ్డ పీడిత ప్రజల కోసం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరుడై కురుమ జాతికి, బహుజన జాతికి బందుకై దొరలను తరిమి కొట్టిన చరిత్రకారుడు దొడ్డి కొమురయ్య కురుమ ఒకటే కుటుంబం నుండి దొడ్డి కొమరయ్య కురుమ, దొడ్డి మల్లయ్య కురుమ అమరులైనారు. దొడ్డి కుటుంబం అన్ని రకాలుగా అంధకారమై చిన్నాభిన్నమై ఆర్థికంగా ధన నష్టం,ప్రాణ నష్టం, జరిగింది కావున ఆ కుటుంబానికి తీరని నష్టం జరిగింది. వరంగల్ జిల్లాలోని మమునూరు ఎయిర్ పోర్ట్ కు దొడ్డి కొమరయ్య కురుమ పేరు పెట్టడం ద్వారా అమరులైన దొడ్డి కుటుంబానికి, ఈ సమాజం గౌరవించినట్టుగా ఉంటుందని సంగారెడ్డి జిల్లా కురుమ యువత నాయకులు బండారి పాండు కురుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కురుమల ఆత్మగౌరవం కాపాడాలంటే మంగునూరు ఎయిర్ పోర్ట్ కు దొడ్డి కొమరయ్య కురుమ పేరు పెట్టాల్సిందేనన్నారు. తెలంగాణలో కురుమలు జనాభాలో అధిక శాతంలో ఉన్నారన్నారు. రాజ్యంలో ఆనాటి నుండి ఈనాటి వరకు కురుమల పాత్ర అమోఘమని కొనియాడారు.

## బీఎన్ రెడ్డి నగర్‌లో రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక మేడ్చల్ :చర్లపల్లి డివిజన్ పరిధిలోని బీఎన్ రెడ్డి నగర్‌లో జరుగుతున్న రోడ్డు అభివృద్ధి పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు పనుల పురోగతిని సంబంధిత అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. బీఎన్ రెడ్డి నగర్‌లో రోడ్ల అభివృద్ధితో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారుతాయని ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, నియోజకవర్గంలో అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## మూడు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న
## తెలంగాణ రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్




మన(ప్రజా(ప్రతినిధి// అక్బర్ పేట్ భూంపల్లి:కి రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ గారి చే బక్కి వెంకటయ్య గారికి ఘన సన్మానం, కమిషన్ సేవల సావనీర్ ఆవిష్కరణతెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా గౌరవ శ్రీ బక్కి వెంకటయ్య గారు పదవీ బాధ్యతలు స్వీకరించి మూడు సంవత్సరాల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి గౌరవ శ్రీ అడ్లూరి లక్ష్మణ్ గారు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య గారితో పాటు కమిషన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా గత మూడు సంవత్సరాల కాలంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నిర్వహించిన కార్యక్రమాలు, చేపట్టిన చర్యలు, బాధితులకు అందించిన సహాయం, ఎస్సీ, ఎస్టీ వర్గాల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన సమీక్షలు, అధికారులతో నిర్వహించిన సమావేశాలు, పెండింగ్ సమస్యల పరిష్కారానికి చేసిన కృషి తదితర అంశాలను పొందుపరిచిన కమిషన్ సేవల సావనీర్ పుస్తకాన్ని మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ గారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ గారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ గత మూడు సంవత్సరాలుగా దేశంలోని ఇతర రాష్ట్రాల్లోని కమిషన్లకు భిన్నంగా, విస్తృత స్థాయిలో తన విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు చేరువైందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సంబంధించిన సమస్యలను కేవలం కార్యాలయ స్థాయిలోనే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బాధితుల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలపై జరిగే దాడులు, వివక్ష, భూ సమస్యలు, సంక్షేమ పథకాలు, విద్య, ఉపాధి, రిజర్వేషన్లు, ప్రభుత్వ శాఖల్లో రోస్టర్ అమలు, బ్యాక్‌లాగ్ ఖాళీలు, బాధితులకు పరిహారం, పెండింగ్ కేసులు తదితర అంశాలపై కమిషన్ ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి పేర్కొన్నారు. మూడు సంవత్సరాల కాలంలో కమిషన్ నిర్వహించిన విధులు, చేపట్టిన సమీక్షలు, అధికారులకు ఇచ్చిన సూచనలు, బాధితులకు అండగా నిలిచిన తీరు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందాయని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు మరియు చట్టపరమైన రక్షణలను వారికి చేరువ చేయడంలో కమిషన్ చురుకైన పాత్ర పోషించిందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ పనితీరుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారి నుంచి కూడా ప్రశంసలు లభించాయని మంత్రి తెలిపారు. రాష్ట్రానికి వన్నె తీసుకువచ్చే విధంగా కమిషన్ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని అన్నారు. అదేవిధంగా, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల కమిషన్ తన రాజ్యాంగబద్ధ బాధ్యతలను అత్యంత క్రమశిక్షణతో నిర్వహించే విధంగా, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ కూడా తనకు అప్పగించిన రాజ్యాంగబద్ధ బాధ్యతలను నిబద్ధతతో, పారదర్శకంగా, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నిర్వహించిందని పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు ప్రశంసించిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య గారి నాయకత్వంలో సభ్యులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని మంత్రి అభినందించారు. భవిష్యత్తులో కూడా ఎస్సీ, ఎస్టీ ప్రజల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ శ్రీ బక్కి వెంకటయ్య గారు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రివర్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా కమిషన్ సభ్యులు, అధికారులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టపరమైన రక్షణలు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూడటం, బాధితులకు న్యాయం అందించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన వారికి చేరేలా పర్యవేక్షించడం కమిషన్ ప్రధాన లక్ష్యమని చైర్మన్ పేర్కొన్నారు. మూడు సంవత్సరాల కాలంలో కమిషన్ చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన పురోగతి, నిర్వహించిన సమీక్ష సమావేశాలు, క్షేత్రస్థాయి పర్యటనలు, బాధితులకు అందించిన సహాయం మరియు ప్రభుత్వ శాఖలతో నిర్వహించిన సమన్వయ కార్యక్రమాలను భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతోనే సావనీర్ పుస్తకాన్ని రూపొందించినట్లు తెలిపారు. బిఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, కమిషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.